


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 95 శుక్రవారం 04 సెప్టెంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

## ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు: సీఎం రేవంత్



చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హైదరాబాద్ అభివృద్ధి, మెట్రో విస్తరణ, మౌలిక వసతులు, పేదల సంక్షేమంపై సీఎం పలు కీలక ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వం కేవలం కొబ్బరికాయ కొట్టి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసిందని తెలిపారు.

## అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు

- వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో కనిపించని మంత్రి నిమ్మల ఫొటో
- నిమ్మల ఫొటోను ముద్రించకపోవడాన్ని తప్పుబట్టిన చంద్రబాబు
- భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదని ఆదేశం



ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటు చేసుకోవడం పై ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వానికి సంబంధించిన శంకు స్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు

## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

- రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్
-స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి
- ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ



రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాం గాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పని తీరు పై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు.

## కొండా సురేఖ బర్తరఫ్ ఆమె స్వయంకృతాపరాధం



మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడం పూర్తిగా ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం సురేఖకు ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ఆమె సద్వి నియోగం చేసుకోలేకపోయారని విమర్శించారు.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధం.. కీవ్‌లో భారత్ కీలక ప్రకటన



- అంతులేని యుద్ధానికి ముగింపు రావాలని మోదీ పిలుపు
- యుద్ధ పరిష్కారం చర్చల ద్వారానే సాధ్యమన్న భారత్ వైఖరి
- కీవ్‌లో ఉక్రెయిన్ విదేశాంగ మంత్రితో జైశంకర్ భేటీ
- ఉక్రెయిన్‌కు భారత్ 19 విడతల్లో 160 టన్నుల సాయం

## నంద్యాల జిల్లా ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు తక్షణ చర్యలు



-శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చొరవతో ప్రజలకు తాగునీరు
-సాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి నిమ్మల సానుకూల హామీ

## వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పవన్ పాత వీడియోను తెర పైకి తెచ్చిన కాంగ్రెస్



- సెజ్‌ల ఏర్పాటు ఘనత వైఎస్సార్‌దేనని పవన్ చెప్పిన మాటల ప్రస్తావన
- గతేడాది కాకినాడ సభలో డిప్యూటీ సీఎం పవన్ చేసిన వ్యాఖ్యలివి
- వైఎస్సార్ చేసిన పనుల బలాన్ని పవన్ మాటలే చెబుతున్నాయన్న కాంగ్రెస్

## భారత్-ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం వార్తలను ఖండించిన అమెరికా



ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 04 సెప్టెంబర్ 2026

## అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు

ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటు చేసుకోవడం పై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వానికి సంబంధించిన శంకు స్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో, అత్యంత సంక్లిష్టమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పనులను సమర్థవంతంగా పూర్తి చేసిన జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ అధికారుల సమన్వయాన్ని సీఎం అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యం ప్రాజెక్టుల వద్దే ఉంటూ, ఎంతో నిరాడంబరతతో పనిచేస్తూ ఫలితాలు సాధిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటవుతోందని చెప్పారు. ఆంధ్ర పాప్‌కార్న్, అరకు కాఫీ ఉత్పత్తులను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో తీవ్రరూపం దాలుస్తున్న ఎల్‌నినో పరిణామాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. గడిచిన 30 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత స్వల్ప వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం మేర తీవ్ర వర్షపాత లోటు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఈరోజే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకూడదని, భూగర్భ జలాల ఆధారంగా అవసరమైతే అదనపు బోర్లు వేసేందుకు తక్షణ అనుమతులు ఇవ్వాలని ఆన్నారు.

# ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు: సీఎం రేవంత్

పాతబస్తీ పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గతంలోనే చెప్పినట్లు ఇది ఓల్డ్ సిటీ కాదని.. 'ఒరిజినల్ సిటీ' అని అన్నారు. ఇక్కడి ప్రతి గల్లీ తనకు తెలుసని పేర్కొన్నారు. అసదుద్దీన్ ఓవైసీ కోరిన అభివృద్ధి పనులను మంజూరు చేయాలని అధికారులను ఈ వేదికగా ఆదేశిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అబ్దుల్లా బలాలా.. కళాశాల అభివృద్ధికి రూ.20 కోట్లు కోరగా.. రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రభుత్వం నిధులు ఇస్తుందని, అయితే ఏడాదిన్నరలోపు అభివృద్ధి పనులు పూర్తి చేసే బాధ్యత ఎమ్మెల్యేదేనని స్పష్టం చేశారు. విద్య కోసం ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో అసదుద్దీన్ ఓవైసీ దేశానికి మద్దతుగా నిలిచి దేశభక్తిని చాటుకున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ సిద్ధాంతాలు వేర్వేరుగా ఉండొచ్చని.. దేశభక్తి విషయంలో మాత్రం అందరం ఒక్కటేనని పేర్కొన్నారు. కేబుల్ బ్రిడ్జిని చూడాలంటే ప్రస్తుతం దుర్గం చెరువుకు వెళ్లాల్సి వస్తోందని సీఎం అన్నారు. అందుకే మీరాలం చెరువులో సుమారు 3 కిలోమీటర్ల మేర కేబుల్ బ్రిడ్జిని నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే వచ్చే ఎన్నికల్లోగా గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు సేవలను పూర్తి చేస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల సమయంలో మెట్రోలో ప్రయాణిస్తూ ప్రజలను ఓట్లు అడుగుతామని వ్యాఖ్యానించారు.

### హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. హిందువులు, ముస్లింలు కలిసి ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని సీఎం ఆరోపించారు. మూసీని అభివృద్ధి చేసి నగరంలో నైట్ ఎకానమీని ప్రోత్సహిస్తామని తెలిపారు. పేద ముస్లింలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్, వనస్థలిపురం, రాజేంద్రనగర్, శంషాబాద్ వరకు మెట్రోను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం భావిస్తోందని సీఎం అన్నారు. అయితే బీజేపీ, బీఆర్ఎస్ అడుగడుగునా అడ్డుపడుతున్నాయని విమర్శించారు. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని.. ఎన్నికలు పూర్తయ్యాక అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి అన్నారు. అందరూ కలిసి హైదరాబాద్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

# కొండా సురేఖ బర్తరఫ్ ఆమె స్వయంకృతాపరాధం

మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడం పూర్తిగా ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం సురేఖకు ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ఆమె సద్వినియోగం చేసుకోలేకపోయారని విమర్శించారు. సొంత కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో సురేఖ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ, ఆమె కుటుంబ సభ్యులు పదేపదే తీవ్రస్థాయిలో బహిరంగ విమర్శలు చేస్తూ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమయంలోనూ వారిని వారించకపోవడం సురేఖ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో కూడిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ కఠిన నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. అధిష్ఠానాన్ని సీఎం బ్లాక్‌మెయిల్ చేశారంటూ సురేఖ చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. అలాగే, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పించబడిన సీనియర్ నేత జి. చిన్నారెడ్డి అంశాన్ని కూడా ఈ సందర్భంగా విప్ ప్రస్తావించారు. చిన్నారెడ్డి అంటే సీఎం రేవంత్ రెడ్డికి ఎంతో గౌరవమని, గతంలో ఆయన గెలుపు కోసం రేవంత్ రెడ్డి శ్రమించారని గుర్తుచేశారు. అయితే ఎంతటి సీనియర్ నాయకులైనా సరే... పార్టీని, ప్రభుత్వాన్ని బలహీనపరిచేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని పార్టీ అధిష్ఠానం తేల్చిచెప్పినందుకే ఈ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

## వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పవన్ పాత వీడియోను తెర పైకి తెచ్చిన కాంగ్రెస్

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఒక ఆసక్తికరమైన రాజకీయ అస్త్రాన్ని ప్రయోగించింది. ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్, గతంలో వైఎస్సార్ పాలనపై చేసిన ప్రశంసల వీడియోను కాంగ్రెస్ పార్టీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. వైఎస్సార్ చేసిన అభివృద్ధి పనుల ప్రభావం ఎంత బలంగా ఉందో చెప్పడానికి, రాజకీయ ప్రత్యర్థి అయిన పవన్ కల్యాణ్ మాటలనే ఉదాహరణగా చూపడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### కాంగ్రెస్ ట్వీట్‌లో ఏముంది?

"రాజకీయాలు ఎలా ఉన్నా.. వైఎస్సార్ చేసిన పని ఎంత బలంగా ఉందో, ఈ మాటలే చెబుతున్నాయి" అనే వ్యాఖ్యతో కాంగ్రెస్ పార్టీ ఈ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "2005 నుంచి నక్కపల్లి సెజ్‌ను వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారే ప్రారంభించారు. ఇది జనసేన కానీ, మిగిలిన పార్టీలు కానీ చేసింది కాదు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారే ఈ సెజ్‌ను ప్రతిపాదించి తీసుకొచ్చారు" అని స్పష్టంగా పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి కోసం వైఎస్సార్ 'ప్రత్యేక ఆర్థిక మండళ్ల'ను (సెజ్‌లు) ఏర్పాటు చేసిన తీరును స్వయంగా పవన్ కల్యాణే అంగీకరించారని కాంగ్రెస్ పార్టీ ఈ ట్వీట్ ద్వారా చెప్పకనే చెప్పింది. వైఎస్సార్ దార్శనికతకు ప్రత్యర్థుల ప్రశంసలే నిదర్శనమని ఆ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

### ఆ వీడియో ఎప్పటిది?

కాంగ్రెస్ ఇప్పుడు పంచుకున్న ఈ వీడియో క్లిప్ గతేడాది అక్టోబర్ నెల నాటిది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లాలో పర్యటించినప్పుడు, ఉప్పాడలో మత్స్యకారుల కోసం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆ సభలో స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ, మత్స్యకారుల ఆందోళనలపై స్పందించారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల వల్ల మత్స్య సంపద దెబ్బతింటోందని, దాని పై సరైన ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆ ప్రాంతంలోని పారిశ్రామిక అభివృద్ధి చరిత్రను వివరిస్తూ, నక్కపల్లి సెజ్‌ను వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే ప్రారంభించారనే వాస్తవాన్ని పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. మొత్తం మీద వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ.. రాజకీయ ప్రత్యర్థి అయిన పవన్ కల్యాణ్ పాత వ్యాఖ్యలనే తమకు అనుకూలంగా మార్చుకుని సోషల్ మీడియాలో ప్రచారానికి ఉపయోగించుకోవడం విశేషం.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధం.. కీవ్‌లో భారత్ కీలక ప్రకటన

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు భారత్ తన వంతు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. యుద్ధానికి ముగింపు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చేసిన పిలుపును ఆయన ప్రస్తావించారు. గురువారం కీవ్‌లో ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రి సిబిహాతో సమావేశమైన సందర్భంగా జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2022లో మొదలైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఐదో ఏడాదిలోకి ప్రవేశించిందని జైశంకర్ అన్నారు. రోజూ యుద్ధం కొనసాగితే మరిన్ని ప్రాణాలు పోవడంతో పాటు భారీ విధ్వంసం జరుగుతుందని పేర్కొన్నారు. సమస్యకు పరిష్కారం యుద్ధభూమిలో దొరకదని భారత్ మొదటి నుంచి చెబుతోందన్నారు. యుద్ధంలో ఉన్న ఇరు దేశాలే పరిష్కార మార్గాన్ని కనుగొనాల్సి ఉన్నప్పటికీ, భారత్ ఏ విధంగానైనా సహాయం చేయగలిగితే అందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. తన కీవ్ పర్యటనకు ద్వైపాక్షిక సంబంధాలే ప్రధాన ఉద్దేశమైనప్పటికీ, ప్రస్తుత యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని జైశంకర్ చెప్పారు. రెండు రోజుల క్రితం కీవ్‌లో జరిగిన దాడిలో ఓ భారతీయుడు మరణించడంపై విచారం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. యుద్ధ ప్రభావంతో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయని జైశంకర్ చెప్పారు. వివిధ దేశాల నౌకల్లో భారతీయ నావికులు పనిచేస్తున్నారని, వారిలో కొందరు కూడా ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. నౌకాయానంపై యుద్ధ ప్రభావం గ్లోబల్ సౌత్ దేశాలపై పడుతోందని, ఇంధనం, ఎరువులు, ఆహార కొరతలకు ఇది కారణమవుతోందన్నారు. ఉక్రెయిన్‌కు భారత్ ఇప్పటివరకు 19 విడతల్లో 160 టన్నుల మానవతా సాయం అందించిందని జైశంకర్ తెలిపారు. ఇందులో జనరేటర్లు, మందులు, వైద్య పరికరాలు ఉన్నాయి. ఉక్రెయిన్‌లో చదువుతున్న భారతీయ విద్యార్థుల విషయంలో ఆ దేశ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

## భారత్-ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం వార్తలను ఖండించిన అమెరికా

కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు.

### ఇరాన్‌కు అణ్వస్త్రం దక్కనివ్వం

ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

## నంద్యాల జిల్లా ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు తక్షణ చర్యలు

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యం లో నంద్యాల జిల్లాలో రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని జిల్లా ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, రాష్ట్ర మంత్రివర్యులు ఎన్, ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర రెడ్డి ,కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, గౌరు చరిత రెడ్డి , గిత్త జయసూర్య,రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి. నిమ్మల రామానాయుడుని కోరారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిమ్మల, రామానాయుడుని కలిసి, వర్షాలు సకాలంలో లేకపోవడంతో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి అవసరమైన నీటిని విడుదల చేయాలని కోరారు. రైతులు మరియు జిల్లా ప్రజల త్రాగు నీరు సమస్యపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు. సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, రైతులకు సాగునీరు అందేలా తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. శ్రీశైలం నియోజకవర్గ ప్రజలకు త్రాగునీరు సాగునీరు అందించే విధంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని గురువారం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో నంద్యాల జిల్లా ఎమ్మెల్యేలు రాష్ట్ర మంత్రులతో కలిసి నంద్యాల జిల్లా ప్రజలకు సాగునీరు అందించే కృషి చేసినందుకు ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## ప్రకృతి ప్రతీకారం-నేపాల్ విలయం!



ఇటీవలి నేపాల్ విలయం వేలాది కుటుంబాలను విషాదాంధకారంలోకి నెట్టివేసింది. హిమాలయ మంచు కొండల శిఖరాగ్రంలో హిమానీపాతం, రాళ్లు, మట్టి కలిసి భోటేకోశీని చివరకు భయంకరమైన బురద నదిగా మార్చివేశాయి. దాంతో గత ఆగస్టు 26న నేపాల్ సహా, టిబెట్ వెంబడి పలు గ్రామాలు, పట్టణాల్లోని సరిహద్దు పోస్టులు, పెద్ద ట్రక్కులు, రహదారులు, విద్యుత్, మౌలిక సదుపాయాలు, ప్రజలను కీటకాల్లా ఆ బురద వరద మింగేసింది. పదకొండు వందల మందికి పైగా ప్రజల మరణానికి, 4,858 మంది ప్రజల అదృశ్యానికి, జీవజాలం నాశనానికి, లక్షల కోట్ల ఆర్థిక నష్టానికి ఈ విలయం కారణమయ్యింది. తమను తుడిచిపెట్టబోయే ఆ బురద సునామీ నుంచి తప్పించుకోడానికి ప్రాణభయంతో పరిగెడుతున్న చిన్న చిన్న మానవరూపాల దృశ్యాలు దిగ్భ్రాంతి కలిగించాయి. ప్రకృతి జరిపిన ఈ దాడి విస్తృతి మనల్ని ఆశ్చర్యపరుస్తోంది. ఈ తరహా దాడిని తట్టుకునే, నివారించగలిగే దృక్కోణం, సామర్థ్యం ఏ మానవ భద్రతా వ్యవస్థకూ లేకపోవడం దురదృష్టకరం.నాగాలాండ్, అస్సాం రాష్ట్రాల్లో.. జూలైలో వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన వరద విపత్తుతో పోలిస్తే నేపాల్ ప్రళయం చాలా పెద్దది. ఈ రెండు సందర్భాల్లోనూ కొన్ని సారూప్యతలు ఉన్నాయి. ఇవి మారుతున్న వాతావరణ సరళి, గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ మార్పులకు సంబంధించినవి. మానవ తప్పిదాలే ఈ విలయాలకు ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. ఎత్తైన హిమాలయాలలోని సున్నితమైన పర్యావరణ వ్యవస్థల ద్వారా, అలాగే దిగువ కొండలు, నదుల ద్వారా ప్రకృతి పదేపదే హెచ్చరికలు పంపినప్పటికీ, ఆ అంశాలను మనం పట్టించుకోలేదు. వాతావరణ మార్పు వచ్చేసింది, అది దాని సహజ స్థితికి తీసుకురాలేని దశకు వేగంగా చేరుకుంటోంది. తత్కారణంగా.. వేల మీటర్ల ఎత్తులో ఉన్న హిమానీనదం శిథిలమవడం వల్లగానీ, విస్ఫోటనం చెందే ప్రమాదంలో ఉన్న హిమానీనద సరస్సుల వల్లగానీ, కొండచరియలు విరిగి పడటానికి కారణమయ్యే తీవ్ర వర్షాల వల్ల గానీ, లేదా బలహీన ప్రాంతాలలో ఉధృతంగా ప్రవహించే వరద నీటి ప్రవాహం వల్ల గానీ తీవ్రమైన వాతావరణం, వర్షాలు, తుపానులు, భారీ వరదల వంటి మరిన్ని విపత్తులకు మనం సిద్ధంగా ఉండాలని ప్రకృతి చాలా కాలంగా హెచ్చరిస్తూనే ఉంది.ఆ హెచ్చరికల్ని మన పాలకులు నిర్లక్ష్యం చేస్తూ అభివృద్ధి పేర పర్యావరణ విధ్వంసాన్ని సృష్టిస్తూనే ఉన్నారు. రాజకీయ నాయకులు, వారిని పోషించే కార్పొరేట్ సంస్థలు, కాంట్రాక్టర్ల జేబుల నింపడం తప్ప మరేమీ చేయని ప్రతిష్ఠాత్మకమైన ఆరు/ నాలుగు లేన్ల హైవేలు సహా, మొత్తం హిమాలయ-- టిబెట్ ప్రాంతంలోని అన్ని ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిలిపివేయాలి. సామ్రాజ్యవాది చైనా నిర్మిస్తున్న భారీ నీటి ప్రాజెక్టు, హైడ్రో ఎలక్ట్రిక్, మిలటరీ నిర్మాణాలు నిలిపివేయకపోతే ప్రకృతి క్రోధానికి ప్రజలు బలి కాకతప్పదు. ఆ నిర్మాణాల వల్ల హిమాలయ ప్రాంతం, తూర్పు పర్వతాల్లో కొండ చరియలు విరిగిపడి వేలాది మంది ప్రజలకు జీవన్మరణ సమస్యలు సృష్టిస్తున్నాయి. నేపాల్ వంటి విపత్తు సంభవిస్తుందనే భయంతో హిమాలయ ప్రాంత ప్రజలు అన్ని జల విద్యుత్ ప్రాజెక్టులనూ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చైనా, భారత్, నేపాల్, భూటాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి అన్ని దేశాల నిపుణులంతా ప్రమాదాలను అంచనా వేసి, రక్షణ ప్రణాళికలను రూపొందించుకోవాలి. ప్రకృతిపై మనం సాధించే విజయాల గురించి మరీ ఎక్కువగా గర్వపడకూడదు. ఎందుకంటే, అటువంటి ప్రతి విజయానికీ ప్రకృతి మనపై ప్రతీకారం తీర్చుకుంటుంది. నిజమే, ప్రతి విజయం మొదట మనం ఆశించిన ఫలితాలనే ఇస్తుంది; కానీ తదుపరి దశలలో అది పూర్తిగా భిన్నమైన, ఊహించని పరిణామాలకు దారితీస్తుంది. అవి తరచుగా ఆ తొలి ఫలితాలనే రద్దు చేసేలా ఉంటాయి. అంటే.. ప్రకృతిపై మనం ఒక విజేతలాగా ఆధిపత్యం చలాయించలేమని ప్రతి అడుగులోనూ అది మనకు గుర్తుచేస్తోంది. ప్రపంచ దేశాలు వాతావరణ మార్పు, భూతాపం అనే సమస్యలపై ఎన్నిసార్లు అంతర్జాతీయ సమావేశాలు, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకున్నా కార్పొరేట్ శక్తుల అత్యాశకు అవి ఆచరణయోగ్యం కాకుండా పోతున్నాయి. భూగోళంలోని అన్ని రకాల జీవ--నిర్జీవ వ్యవస్థలు, ప్రక్రియలన్నీ కార్పొరేట్ సంస్థల స్వార్థానికి కోలుకోలేని విధ్వంసక స్థితికి చేరుకుంటున్నాయి. 'ప్రకృతి మన కొనసాగింపు' అనే స్పృహ, దృక్కోణం లేకుండా కేవలం మానవ అవసరాలను తీర్చే వినియోగ వస్తువుగాను, సంపదగాను ప్రకృతిని చూసే రాజకీయార్థిక విధానాన్ని విడనాడకపోతే మానవజాతి కూడా అంతరించిపోతున్న జీవరాశుల జాబితాలో చేరే ప్రమాదం ఉంది. ప్రకృతి--సమాజాల మధ్య ఆదాన ప్రదానాల క్రమాన్ని పునరుజ్జీవింపజేసే దృక్పథంతో కూడిన సమాజం కోసం ప్రజలు ఈ గ్లోబల్ కార్పొరేట్ పక్షపాత ప్రభుత్వాలను, రాజ్యాలను జెన్‌జీ ఉద్యమ స్ఫూర్తితో నిలదీయాల్సిన అవసరాన్ని నేపాల్ బురద వరద బీభత్సం నొక్కి చెబుతోంది.

# ఓటరు జాబితా నుంచి జనగణన వరకు

-పల్నాడులో కీలక డేటా ప్రక్రియలపై కలెక్టర్ కృతికా శుక్లా ప్రత్యేక దృష్టి
-ఎస్ఐఆర్‌లో పారదర్శకత.. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌లో 100 శాతం కచ్చితత్వానిక ఆదేశాలు

నరసరావుపేట,సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

: పల్నాడు జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణతో పాటు జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీ ప్రక్రియలను అత్యంత కచ్చితత్వం, పారదర్శకతతో పూర్తి చేయడంపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ప్రత్యేక దృష్టి సారించారు. పెండింగ్ ఓటరు దరఖాస్తుల పరిష్కారంతో పాటు జనగణన గణాంకాల్లో 100 శాతం ఖచ్చితత్వం ఉండేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పల్నాడు జిల్లా భవిష్యత్ ప్రణాళికలకు కీలకమైన ఓటరు జాబితా సవరణ, జనగణన సమాచార సంకలనం ప్రక్రియలను అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో పూర్తి చేయడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని చర్యలు చేపట్టడంతో పాటు, జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ) తయారీలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమాచారాన్ని ధ్రువీకరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ సచివాలయంలోని సీఈఓ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమీక్షించారు. ఓటరు జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు ఆగస్టు 31తో ముగిసినప్పటికీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజల అభ్యర్థన మేరకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా పరిస్థితిపై కలెక్టర్ కృతికా శుక్లా వివరాలు వెల్లడించారు. ఆగస్టు 31 నాటికి ఫారం-6 కింద 5,258, ఫారం-7 కింద 85, ఫారం-8 కింద 3,878 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్ఓ' కార్యక్రమం కింద 3,446 కాల్స్ స్వీకరించగా, 3,361 కాల్స్‌కు స్పందించినట్లు వివరించారు. ఆరు కాల్స్ పెండింగ్‌లో ఉండగా, 79 మంది ఓటర్లు అందు బాటులో లేరని పేర్కొన్నారు. పెండింగ్ అంశాలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి హామీ ఇచ్చారు. నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా నాణ్యతను మరింత మెరుగుప రిచేందుకు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రతులను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు సకాలంలో అందజేశామని చెప్పారు. తుది ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పి దాలకు అవకాశం లేకుండా అత్యంత పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఇదే సమయంలో, పల్నాడు జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీ, సమాచార సంకలనంపై కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో ఉన్నతస్థాయి సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 28 మండలాలు, మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో పరిపాలనా సరిహద్దు పటాలను తుది ఖరారు చేయడం, ప్రతి రెవెన్యూ గ్రామం, పట్టణ వార్డు వారీగా ప్రాథమిక జనాభా గణన సారాంశం, మౌలిక సదుపాయాల గణాంకాలను కచ్చితంగా సంకలనం చేయడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌లోని పార్ట్-ఎలో గ్రామ,



పట్టణ డైరెక్టరీ, పార్ట్-బిలో ప్రాథమిక జనాభా సారాంశానికి సంబంధించిన సమాచారంలో 100 శాతం ఖచ్చితత్వం ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, విద్య, వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల మధ్య పటిష్టమైన సమన్వయం ఉండాలని సూచించారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనతో పాటు సామాజిక, ఆర్థిక విధానాల అమలుకు అత్యంత కీలకమైన పత్రంగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ తమ పరిధిలోని సమాచారాన్ని వ్యక్తిగతంగా ధ్రువీకరించి, నిర్దేశించిన గడువులోగా సమర్పించాలని ఆదేశించారు. ఓటరు జాబితా వంటి ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన సమాచారాన్ని పారదర్శకంగా రూపొందించడంతో పాటు, జిల్లా అభివృద్ధి ప్రణాళికలకు పునాదిగా నిలిచే జనగణన గణాంకాలను కచ్చితంగా సిద్ధం చేయడమే లక్ష్యంగా పల్నాడు జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది. రెండు కీలక ప్రక్రియలపై కలెక్టర్ స్వయంగా సమీక్షలు నిర్వహించడం జిల్లా పరిపాలనా యంత్రాంగంలో సమాచార నాణ్యతకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తోంది. ఈ సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ అద్దయ్య, ఆర్డీవో బాలకృష్ణతో పాటు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సార్ సార్ – అంతా నేనే!

- పార్టీ కార్యక్రమాలకు దూరంగా స్థానిక నేతలు
- అగ్రనేతల పర్యటనలో మాత్రం సందడి
- వర్గ విభేదాలతో కార్యకర్తల్లో పెరుగుతున్న అయోమయం

బాపట్ల సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

బాపట్ల నియోజకవర్గ జనసేనలో నాయకుల వ్యవహారశైలిపై కార్యకర్తలు, అభిమానుల్లో చర్చ మొదలైంది. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో కనిపించని కొందరు నాయకులు, అధినాయకుల పర్యటనలో మాత్రం ముందుండేందుకు పోటీ పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి స్థానిక నాయకత్వంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా స్థానికంగా చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో నియోజకవర్గ పార్టీలో సమన్వయంపై చర్చ సాగింది. తాజాగా రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ సొసైటీ కమిటీ చైర్మన్ కొణిదెల నాగబాబు సూర్యలంక సముద్ర నగరవనం, మడ అడవుల పర్యటనకు రావడంతో స్థానిక జనసేన నాయకులంతా ఒక్కసారిగా కనిపించడం కార్యకర్తల్లో చర్చకు దారితీసింది.పార్టీ కార్యాలయం నుంచి పిలుపునిచ్చిన కార్యక్రమాలు, స్థానిక కార్యకర్తల కార్యక్రమాల్లో కొందరు నాయకులు అందుబాటులో ఉండటం లేదనే అభిప్రాయం కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. అయితే అధినాయకులు నియోజకవర్గానికి వచ్చినప్పుడు మాత్రం తమకే అధినాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లుగా వ్యవహరించడం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేయడం, కార్యకర్తలకు అండగా నిలవడం, పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించడం కంటే అధినాయకుల దృష్టిలో పడేందుకు పోటీ పడుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పార్టీ కోసం పనిచేసే నాయకత్వం కావాలా.. పదవులు, పెత్తనం కోసం పోటీ పడే నాయకత్వం కావాలా అన్న చర్చ జనసైనికుల్లో సాగుతోంది.ఇదే తరహాలో నియోజకవర్గంలో వర్గాలు కొనసాగితే భవిష్యత్తులో



పార్టీపై ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రా యపడుతున్నారు. స్థానిక విభేదాలకు స్వస్తి పలికి, నాయకులు-కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగు ణంగా ప్రజాసేవకు ప్రాధాన్యం ఇచ్చే సమన్వయ నాయ కత్వం కోసం పార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్నాయి.

# షదాబ్ బిర్యానీ లైసెన్స్ రద్దు

హైదరాబాద్ సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలోని కేఫ్‌లు, స్నాక్ పాయింట్లపై తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన 9 ప్రత్యేక బృందాలు బుధవారం దాడులు నిర్వహించాయి. ఆహార భద్రతాధికారులు, పోలీసుల భాగస్వామ్యంతో మొత్తం 19 కెఫేల్లో తనిఖీలు చేపట్టారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు లేకపోవడం, పురుగులు, ఈగలు స్వైర విహారం, ఆహార పదార్థాల గడువు ముగియడం, పారిశుద్ధ్య లోపాలు, సిబ్బందికి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం లాంటి ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు. ఎలాంటి లైసెన్సు లేకుండా బాగ్‌లింగం పల్లిలోని డ్రీమ్స్‌కేఫ్, పంజాగుట్టలోని ఆసియాటిక్ కేఫ్‌లను అధికారులు మూయించారు. పారిశుద్ధ్య లోపం, అపరిశుభ్రత మధ్య మాంసం నిల్వ చేయడం లాంటి ఉల్లంఘనలు ఉండటంతో మదీనాలోని షాదాబ్ కేఫ్ లైసెన్సును సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. వ్యాపారాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ఆయా కేఫ్‌ల నుంచి 15 నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఉల్లంఘనలకు పాల్పడిన 5 ప్రధాన




కేఫ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిమ్రా, బ్లూసీ, డైమండ్ పాయింట్, పర్షియా తదితర వాటికి ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ - ఏపీజేఏసీ






**-సెప్టెంబర్ 5 వరకు గడువు**
**-స్పందన లేకుంటే ఉద్యమిస్తాం**
**-తాలూకా జేఏసీ చైర్మన్ షేక్, సాజిద్ బాషా**

ఆత్మకూరు సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

రాష్ట్ర ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ,విజయవాడ పిలుపుమేరకు, గురువారం పట్టణంలోని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ, ఆత్మకూరు తాలూకా కార్యవర్గ సమావేశం తాలూకా అధ్యక్షులు ఏపీ జేఏసీ చైర్మన్ ఎస్.సాజిద్ బాషా సభ అధ్యక్షతన పెన్షనర్ భవన్, లో సుదీర్ఘంగా జరిగిన సమావేశంలో పలు అంశాలను చర్చించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూసుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగ ,ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక బకాయిలు మరియు ఆర్థికేతర డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి అందులో ప్రధానంగా 12 వ పిఆర్సి ఏర్పాటు చేయాలి అంతవరకు ఐఆర్ ను ప్రకటించాలి దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న నాలుగు సరెండర్ లీవ్ ల ను వెంటనే విడుదల చేయాలి పెండింగ్ లో ఉన్న ఐదు డిఏలలో వెంటనే రెండు డిఏలు విడుదల చేయాలిపెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వారి కోరిక మేరకు అమలు చేయాలి రాష్ట్ర ప్రభుత్వము వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించిన ఆర్థిక పరమైన డిమాం డ్లను ,ఆర్థికేతర డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి లేనిపక్షంలో ఈనెల 5వ తేదీ రాష్ట్ర జేఏసీ చైర్మన్ కామ్రేడ్ ఆలపర్తి విద్యాసాగర్ సెక్రటరీ జనరల్ ప్రసాద్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. వి.రమణ పిలుపు మేరకు భవిష్యత్తు కార్యాచరణక, సిద్ధమవుతామని, తెలియజేశారు, అవసరమైతే ఉద్యమాలకు ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీ జెఏసి తాలుక సెక్రటరీ జనరల్ ఎం. ఎస్. ఉమ్మర్ ట్రెజరర్ ఎం చంద్రశేఖర్, జేఏసీలోని మిత్ర సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు, పి ఆర్ టి యు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష,పెన్షనర్ అసోసియేషన్ పంచాయతీరాజ్ అసోసియేషన్ సభ్యులు . కళ్యాణ్ , ఆలం బాషా, ఎన్జీవోస్ కార్యవర్గ సభ్యులు డి .ప్రవీణ్, రఘు, ఫక్రుద్దీన్, హేమ సుందర్ రెడ్డి, శ్రీను, సతీష్, రాష్ట్ర కార్యదర్శి నూర్ మొహమ్మద్, జనార్ధన్, బాలాజీ రావు,,. శివ ప్రసాద్, చంద్రకుమార్, అబ్దుల్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతపై అక్రమ కేసులా..? భేషరతుగా ఎత్తివేయాలి-- నంది రైతు సమాఖ్య

నంద్యాల సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

సాగునీరు, తాగునీరు ఇవ్వాలని అడిగితే.నీరు విడుదల చేయాల్సిన ప్రభుత్వమే, అన్నం పెట్టే రైతులపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు న్యాయం? ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌ను కలవడానికి వెళ్లిన రైతులపై, వారికి మద్దతుగా నిలిచిన మాజీ ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేయడాన్ని 'నంది రైతు సమాఖ్య' అత్యంత తీవ్రంగా, కన్నీటి పర్యంతమై ఖండిస్తోంది! "రైతులు రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించలేదు, వినాశనం కోరలేదు. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి, పశువుల దాహార్తి తీర్చడానికి నీళ్లివ్వమని వేడుకోవడమే మేము చేసిన నేరమా?" అని నంది రైతు సమాఖ్య నాయకులు గళమెత్తారు. వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే గేట్లు వేసి అడ్డుకోవడం, శాంతియుతంగా రోడ్డుపై కూర్చుంటే... ఏకంగా 35 మందిపై కేసు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. కలెక్టరేట్ ఏమీ నిషేధిత ప్రాంతం కాదు, రైతులేమీ నేరస్థులు కారన్నారు. స్థానిక మంది రైతు సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షులు రామ సుబ్బారెడ్డి, జనరల్ సెక్రెటరీ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి మధుసూదన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శంకర్ నాయక్ మాజీ సర్పంచ్ కోటిరెడ్డి ఎర్రన్న మీడియా సమావేశం నిర్వహించారు. నంది రైతు సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ..శ్రీశైలంలో నీళ్లున్నా. రైతుల గుండెల్లో మంటలా రాయలసీమ ప్రాంత ప్రాజెక్టు అయిన శ్రీశైలంలో ఏకంగా 175 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నప్పటికీ, దిగువకు నీటిని విడుదల చేయకుండా రోజులు గడుపుతుంటే రైతాంగం ఎలా తట్టుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు లేక, సాగునీరు అందక రైతులు, ప్రజలు, పశువులు అల్లాడిపోతున్నాయన్నారు. సెప్టెంబర్ 15 నుండి ప్రారంభమయ్యే రబీ సీజన్ లో 100 రోజుల పంటలు సాగు చేసుకోవడానికి వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. నాడు కమతాల్లో చెమటోడ్చి దేశానికే అన్నం పెట్టిన రైతు... నేడు హక్కుల కోసం, ప్రాణాధారమైన నీటి కోసం రోడ్డెక్కితే వేధింపులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం? రైతులపై, వారికి అండగా నిలిచిన ప్రజాప్రతినిధులపై బనాయించిన అక్రమ కేసులను జిల్లా కలెక్టర్ మరియు ప్రభుత్వం వెంటనే, బేషరతుగా ఉపసంహరించుకోవాలని కోరారు. కక్షసాధింపు చర్యలు మాని, తక్షణమే దిగువకు సాగు, తాగునీటిని విడుదల చేసి రైతాంగాన్ని, రాయలసీమను కరువు కోరల నుండి కాపాడాలని నంది రైతు సమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.



# వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకుందాం

**-సాంప్రదాయ పండుగలను అన్ని సామాజిక వర్గాల ప్రజలు శాంతియుతంగా,జరుపుకోవాలి**
**-కులమతాలకతీతంగా పండగలు జరుపుకోవాలని**
**-సోదర భావంతో కలిగి మెలిగి ఉన్నప్పుడే సమాజంలో మంచి గుర్తింపు**
**-ఆత్మకూరు డిఎస్పి ఆర్. రామాంజి నాయక్**

ఆత్మకూరు సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

పట్టణంలో అర్బన్ సీఐ ఓ.మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మత పెద్దలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్, ఆర్డిఓ వెంకట శివ లు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా, అన్నదమ్ముల వలె సోదర భావంతో కలిసి మెలిసి ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండగను నిర్వహించు కోవాలని సూచించారు. పోలీసు వారి నిబంధనలు వినాయక మంటప నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు.ప్రజలు పోలీసు వారికి సహకరించాలని అందరం కలిసి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, ఆత్మకూరు మండల తాసిల్దార్ రత్న రాధిక, పాములపాడు, కొత్తపల్లి, వెలుగోడు మండల తాసిల్దార్లు, ఎక్సేంజ్ సీఐ ఈ. మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బేబీ, విద్యుత్ శాఖ ఏఈ, అగ్నిమాపక శాఖ అధికారులు, ఆత్మకూరు ఎస్సై డి.వెంకటనారాయణ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఆత్మకూరు మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన

**-ఓటర్ల జాబితా విడుదల**
**-ఆత్మకూరు పురపాలక సంఘం కమిషనర్ ఏ. బేబీ**
**-సర్ ఓటర్ల జాబితాతో ముందుకు**
**-ప్రత్యేక అధికారి ఆత్మకూరు ఆర్డీవో కే వెంకట శివ**

ఆత్మకూరు సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన ప్రక్రియ పూర్తయింది. గతంలో ఆత్మకూరు పట్టణంలో ఉన్న 28 వార్డుల స్థానంలో ప్రస్తుతం 32 వార్డులకు సంబంధించిన ఓటర్ల జాబితాను పురపాలకా సంగం స్పెషల ఆఫీసర్ ఆర్డీవో కె. వెంకట శివ మరియు మున్సిపల్ కమిషనర్ బేబీ అధికారులతో విడుదల చేశారు. ఆత్మకూరు పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ఓటర్ల జాబితాను ప్రజలకూ అందుబాటులో ఉంచినట్లు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బేబీ తెలియజేశారు. వార్డుల పునర్విభజన తర్వాత ఓటర్ల వివరాలను తెలుసుకోవడానికి మున్సిపల్ కార్యాలయంలోని ఎలక్షన్ సెల్ లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు వార్డుల్లోని ఓటర్ల జాబితాను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.




## శ్రీ కృష్ణ జన్మదిన వేడుకలను జయప్రదం చేయండి



వెలుగోడు సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

వెలుగోడు పట్టణంలో నేడు జరిగే శ్రీ కృష్ణ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయవలసిందిగా త్రైత సిద్ధాంతం ప్రతినిధి వెంకటేశ్వర్లు, యాదవ సంఘము నాయకులు జనార్ధన్ యాదవ్ , రఘు రాముడు యాదవు లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు వేల సంవత్సరాల క్రితమే ప్రపంచ వ్యాప్తంగా ఆరాధ్య దైవంగా పూజించబడే శ్రీకృష్ణ మహాత్ముని జన్మదిన జయంతి ఉత్సవాలకు త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక వాసవి కళ్యాణ మండపంలో ఉదయము ఆరు గంటల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించబడును. రెండు గంటలకు పట్టణములో శ్రీకృష్ణ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేయబడును.ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, విద్యావంతులు, ప్రతిభావంతులు, యువకులు, మహిళలు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## ఉచిత కంటి ఆపరేషన్ లను సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట ఆగస్టు 3 వార్త సాక్ష్యం

స్ఫూర్తి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి ఆపరేషన్ లను సద్వినియోగం చేసుకోవాలని స్ఫూర్తి క్లబ్ డిస్టిక్ చైర్మన్ పోనుగోటి నిర్మల తెలిపారు. గురువారం మద్దిరాల మండలం కుక్కడం గ్రామంలో సూర్యాపేట లయన్స్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి ఆపరేషన్ క్యాంపును ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు కంటిపై అశ్రద్ధ పెట్టకుండా జాగ్రత్త వహించాలన్నారు. స్ఫూర్తి క్లబ్ ద్వారా సుమారుగా 1000 కంటి ఆపరేషన్ చేయనుట్లు తెలిపారు. మీ మరణాంతరం మీ శరీరం దహనం కాకుండా ఇతరులకు ఉపయోగపడే విధంగా దానం చేయాలన్నారు. ఈ క్యాంపులో 90 మంది పాల్గొనగా 19 మందికి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుకు సహకరించిన గ్రామ సర్పంచ్ భిక్షం కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్ఫూర్తి క్లబ్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్

**-నిబంధనలు ఉల్లంఘించిన వీఆర్ఓ సస్పెన్షన్**
**-జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్**

నంద్యాల, సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం



ప్రభుత్వ భూములు, గ్రామకంఠం, పోరంబోకు భూముల విషయంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ హెచ్చరించారు. ప్యాపిలి మండలం మాధవరం గ్రామంలో గతంలో వీఆర్ఓగా పనిచేసిన మల్లారెడ్డి, సర్వే నంబర్ 507లోని గ్రామకంఠం (ప్రభుత్వ పోరంబోకు) భూమిని సరైన ఆధారాలు, సహాయక పత్రాలు లేకుండా ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసినట్లు అందిన ఫిర్యాదుపై జాయింట్ కలెక్టర్ విచారణ చేపట్టారు.విచారణలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ కావడంతో ప్రస్తుతం డోన్-1 క్లస్టర్ వీఆర్ఓగా పనిచేస్తున్న మల్లారెడ్డిని బుధవారం సస్పెండ్ చేసినట్లు జాయింట్ కలెక్టర్ నేడోక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించినా, అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## వినాయక మండపాల అనుమతులకు ఈ-పోర్టల్

**-ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా**

అమరావతి సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం



వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహ కులకు ఆన్లైన్లో అనుమతులు మంజూరు చేసేందుకు సింగిల్ విండో ఈ-పోర్టల్ www .ganeshutsav. net ను ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. వివిధ శాఖల కార్యాలయాల చుట్టూ తిరగ కుండా అనుమతులన్నీ ఈ పోర్టల్ ద్వారా సులువుగా పొందొచ్చు. ఈ వివరాలను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 04 సెప్టెంబర్ 2026

# పెండింగ్ రోడ్లు పట్టాలెక్కాయి

తెనాలిసెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం



పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న తెనాలి--చందోలు (కూచిపూడి) రహదారి నిర్మాణ పనులు ఎట్టకేలకు వేగం పుంజుకున్నాయి. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు చొరవతో పెండింగ్ పనులు ప్రారంభమై ప్రస్తుతంకొనసాగుతున్నాయి. రహదారికి ఇరువైపులా జంగల్ క్లియరెన్స్ పనులు పూర్తికాగా, ప్రస్తుతం డిగ్గింగ్ పనులు చేపడుతున్నారు. పెదరావూరు నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లతో పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితుల్లో ఎమ్మెల్యే స్వయంగా వారితో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగాఅంగలకుదురు--నడిగడ్డపాలెం రహదారి నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. రహదారి పనుల పురోగతిపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను మరింత వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# విద్యా వసతులపై కేంద్రానికి విజ్ఞప్తి



బాపట్ల సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో విద్యా ప్రమాణాలను సమగ్రంగా మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసినియోజకవర్గంలోని విద్యారంగ సమస్యలు, అవసరాలపై చర్చించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో విద్యా ప్రమాణాల పెంపు, విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన, ప్రతిపాదిత విద్యా ప్రాజెక్టుల అమలుకు సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి సమర్పించారు. విద్యారంగ సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదిత ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.బాపట్ల పార్లమెంట్ పరిధిలో విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు అందుబాటులోకి తీసుకురావడం, విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని ఆయన కోరారు.

# ఓటర్ల జాబితా పరిశీలనలో వేగం పెంచాలి

-కలెక్టర్ వినోద్ కుమార్



బాపట్ల సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

బాపట్ల జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జిల్లాలో ఓటర్ల వివరాల పరిశీలన, దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి. తెలిపారు. గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ నిర్వహించిన సమీక్షలో జిల్లాలో జరుగుతున్న ప్రక్రియను వివరించారు.జిల్లాలో సుమారు 9 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటికే 6 లక్షలకు పైగా ఓటర్ల వివరాలను పరిశీలించి తుది జాబితా ముద్రణకు సిద్ధం చేసినట్లు తెలిపారు. మిగిలిన ఓటర్ల వివరాల పరిశీలన కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం కొత్త ఓటర్ల నమోదు కోసం 5,287, తొలగింపునకు 63, సవరణలకు 3,583 దరఖాస్తులు మాత్రమే పరిశీలనలో ఉన్నాయని చెప్పారు.అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి దరఖాస్తుల పరిశీలన, విచారణను వేగవంతం చేశామని, పొడిగించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ సూచించారు.సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యరంగంలో 'నాయక్'ల సంచలనం-ఒకే కుటుంబంలో ముగ్గురు డాక్టర్లు





**-కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించిన కె.సాయి సంతోష్ నాయక్-తల్లిదండ్రుల ఆనందం**

**-నీట్‌లో మెరిసిన గిరిజన కెరటం- ఎస్టీ కోటాలో ఆల్ ఇండియా 977వ ర్యాంక్**

ఆత్మకూరు సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కురుకుంద గ్రామ ప్రభుత్వ జడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయుడు కాట్రావత్ జవహర్ నాయక్ కుమారుడు సాయి సంతోష్ నాయక్ ఎంబిబిఎస్ సీటు సాధించడం జరిగింది. లక్ష్య సాధనలో ముగ్గురు పిల్లల దిగ్విజయం, సంతోషంలో తల్లిదండ్రులు కె.జవహర్ నాయక్, శారదబాయి లు మునిగి తేలుతున్నారు.కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు. సాయి సంతోష్ నాయక్. జాతీయ స్థాయిలో నిర్వహించిన 2026 నీట్ పరీక్ష ఫలితాల్లో ఆయన విశేష ప్రతిభ కనబరిచారు. మొత్తం 495 మార్కులు సాధించిన కె. సాయి సంతోష్ నాయక్, ఆల్ ఇండియా ఎస్టీ కోటా విభాగంలో 977వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. ఈ అత్యుత్తమ ర్యాంకుతో ప్రతిష్టాత్మకమైన కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీ ఎస్ (ఎంబీబీఎస్) సీటును కైవసం చేసుకున్నారు. సంతోష్ విజయం వెనుక వారి కుటుంబ కృషి ఎంతగానో ఉంది. ఇప్పటికే ఈ దంపతుల ఇద్దరు పిల్లలు వైద్య విద్యను అభ్యసిస్తుండగా, ఇప్పుడు మూడో కుమారుడు సాయి సంతోష్ నాయక్ కూడా మెడికల్ సీటు సాధించడంతో ఆ ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. ఒకే కుటుంబం నుంచి ముగ్గురు పిల్లలు వైద్య రంగాన్ని ఎంచుకుని, ఉన్నత విద్యకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు అమితా నందం, హర్షం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల క్రమ శిక్షణ, నిరంతర శ్రమే ఈ రోజు తమను సమాజంలో గర్వపడేలా చేసిందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.కాట్రావత్ జవహర్ లాల్ నాయక్ కుమార్తెలు ప్రియాంక భాయి, ప్రీతి బాయి, కుమా రుడు సాయి సంతోష్ నాయక్ ల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, స్థానికులు శుభాకాంక్షలు తెలియజేసి, అభినందనలతో ముంచెత్తుతున్నారు.

# రైతులకు పట్టాలు పంపిణీ

వేమూరు సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం



రైతుల భూ హక్కులకు భరోసా కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కార్యక్రమంలో భాగంగా అమృతలూరు గ్రామంలో రీసర్వే పూర్తయిన 1,836 మంది అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు పంపిణీ చేశారు. అమృతలూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు పాస్‌పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల భూ హక్కుల పరిరక్షణ, భూ రికార్డుల్లో పారదర్శకత, భూ వివాదాల నివారణ లక్ష్యంగా రీసర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. రీసర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాల్లో స్పష్టత ఏర్పడుతుందని తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు రైతులకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు, వ్యవసాయ, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.అమృతలూరు మండల పరిధిలోని 13 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ దశలవారీగా కొనసాగుతోంది. ఇప్పటికే బోడపాడు, ఎలవర్రు, కోరుటాడిపర్రు, పెదపూడి గ్రామాల్లో 2,448 పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయగా, తాజాగా అమృతలూరులో 1,836 పాస్‌పుస్తకాలు అందజేశారు. దీంతో మండలంలో ఇప్పటివరకు పంపిణీ చేసిన పాస్‌పుస్తకాల సంఖ్య 4,284కు చేరింది.గోవాడలో రీసర్వే పూర్తికాగా, అక్టోబర్‌లో సుమారు 1,950 మంది రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపడు తున్నారు. పాపర్ల, మోపర్రు, తురుమెళ్ల గ్రామాల్లో రీసర్వే పనులు కొనసాగుతుండగా, ఇంటూరు, పాంచాలవరం గ్రామాల్లో తదుపరి దశ పనులు జరుగుతున్నాయి. మూలపాలెంలో రీసర్వే ప్రారంభమైంది. కూచిపూడిలోనూ త్వరలో పనులు ప్రారంభిం చనున్నట్లు అధికారులు తెలిపారు.రైతులకు భూ హక్కులకు సంబంధించిన సేవలను గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రీసర్వేను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులు భూ యాజమాన్య వివరాల్లో స్పష్టత రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు అక్షరాస్యత పై చైతన్యం

బాపట్లసెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం



బాపట్ల జిల్లాలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న అక్షరాస్యత పక్షోత్సవాల్లో భాగంగా ముత్తాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. "ప్రజలు, పర్యావరణం మరియు సుసంపన్నత కోసం అక్షరాస్యత" అనే అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం- 2026 నినాదానికి అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టారు.'అక్షర ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులకు అక్షరజ్ఞానం అందించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాలకు అక్షరాస్యతను చేరువ చేసేందుకు మహిళా సంఘాలు, ఉపాధి హామీ పథకం కూలీల సహకారం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ముత్తాయపాలెం పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి చదువు ప్రాధాన్యతను చాటుతూ గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.అందరూ భాగస్వాములై అక్షరాస్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కార్యక్ర ్మంలో బాపట్ల డివిజన్ వయోజన విద్య పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్, షేక్ బాదుల్లా, సీహెచ్. శివరాం ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షురాలు కర్రీ అరుణ, సంఘ సేవకురాలు బి.రజిని, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాయిబాబా దేవాలయంలో చోరీకి యత్నం

ఆలేరు సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం:





యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో బుధవారం అర్ధరాత్రి దుండగులు చోరీ చేసేందుకు ప్రయత్నించారు. డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, ఆలేరు. ఎస్ హెచ్ ఓ ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం అర్ధరాత్రి దొంగలు గుడి వెనుక ద్వారం నుండి తాళాలు పగలగొట్టి గుడిలో చోరబడి వెండి ఆభరణాలు దొంగలించడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. వాచ్మెన్ మేలుకొని గగ్గోలు పెట్టడంతో అక్కడినుండి పారిపోయారు. గుడి నిర్వాహకులను సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. అతి త్వరలో దొంగలను పట్టుకుని చట్టారీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.దర్యాప్తులో పాల్గొన్న రూరల్ ఎస్సై వినయ్ కుమార్ , క్రైమ్ పార్టీ చంద్రశేఖర్ , మహేష్ క్లూస్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# గోకులాలకు శ్రీకారం

రెంటచింతల సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

రెంటచింతల మండలంలోని పశుపోషకుల ఆర్థిక అభివృద్ధి, పశువుల సంరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన గోకులాల నిర్మాణ కార్యక్రమానికి రెంటచింతల మండలంలో శ్రీకారం చుట్టారు. 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని మొదటి వార్డు రైల్వే గేటు సమీపంలో నూతన గోకులం నిర్మాణానికి టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్. అబిరెడ్డి గురువారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల సంరక్షణతో పాటు పాల ఉత్పత్తిని పెంచేందుకు గోకులాల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రెంటచింతల మండలానికి మొత్తం 13 గోకులాలు మంజూరైనట్లు తెలిపారు. పథకం కింద లబ్ధిదారుడు రూ.20 వేల వంతు పెట్టుబడి చెల్లిస్తే, ప్రభుత్వం రూ.1.80 లక్షల సబ్సిడీ అందిస్తుందని వివరించారు. మండలంలోని రెంటచింతల, తుమ్మరకోట గ్రామాలకు మూడు చొప్పున గోకులాలు కేటాయించగా, మిగిలిన గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున మంజూరైనట్లు తెలిపారు. పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అబిరెడ్డి కోరారు.కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి స్వరూపరాణి, ఏపీవో జి.వెంకటేశ్వర్లు, సాంకేతిక సహాయకుడు భాస్కర్ నాయక్, టీడీపీ నాయకులు సుమంత్‌రెడ్డి, ప్రభురా జు, కొండలు, స్థానిక నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# సూర్యలంక అభివృద్ధికి ప్రశంసల వెల్లువ

బాపట్ల సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

సూర్యలంక సముద్ర తీరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు చేస్తున్న కృషిని సినీ ప్రముఖులు అభినందించారు. పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పిస్తూ సూర్యలంకను అంతర్జాతీయ స్థాయి టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమన్నారు. ప్రముఖ హీరో శ్రీకాంత్, మలయాళ నటుడు, దర్శకుడు మేజర్ రవి తమ చిత్ర బృందంతో సూర్యలంక సముద్ర తీరాన్ని సందర్శించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు వారికి ఘన స్వాగతం పలికారు. యాగంటి రిసార్ట్స్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో సూర్యలంక అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ సూర్యలంక ప్రకృతి సౌందర్యం, సముద్ర తీరం ఎంతో ఆకట్టుకుంటున్నాయని, సినిమా షూటింగ్‌లకు కూడా ఇది అద్భుతమైన లొకేషన్‌గా అనుకూలంగా ఉంటుందని తెలిపారు. సూర్యలంకను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు చేస్తున్న కృషిని పలువురు సినీ ప్రముఖులు ప్రశంసించారు. కార్యక్రమంలో నటులు మహాదేవన్, రాజా రవీంద్ర, సినీ నిర్మాత సురేష్ కొండేటి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సంతృప్తే ప్రభుత్వ సేవలకు కొలమానం

గుంటూరు, సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

ప్రభుత్వ శాఖలు అందిస్తున్న సేవలు ప్రజల పూర్తి సంతృప్తికి అనుగుణంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు కేవలం అమలుకే పరిమితం కాకుండా, వాటి ప్రయోజనాలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలపై ప్రజల్లో సానుకూల అవగాహన, సంతృప్తి పెంపుపై సంబంధిత శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతర పర్యవేక్షణ నిర్వహించి, పథకాల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా అర్హులైన ప్రజలు పూర్తి స్థాయిలో లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పథకాలు అమలు కావడం మాత్రమే కాకుండా, వాటి ద్వారా ప్రజలు శతశాతం సంతృప్తి చెందే పరిస్థితి ఉండాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. సానుకూల దృక్పథంతో మాట్లాడటం, సమస్యలను ఓర్పుతో వినడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వ సేవలపై విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించిన వ్యక్తులతో అధికారులు నేరుగా మాట్లాడి, వారి సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై తగిన సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనకు ఇంటింటి సర్వే

గుంటూరు, సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలన లక్ష్యంగా చేపడుతున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కుష్టు వ్యాధి నిర్మూలన సమన్వయ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా కుష్టు వ్యాధి గుర్తింపు కోసం ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. సర్వే ప్రక్రియపై సంబంధిత అధికారులు స్పష్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. కుష్టు వ్యాధి కేసులను ప్రారంభ దశలోనే గుర్తించి అవసరమైన చికిత్స అందించడం ద్వారా జిల్లాను కుష్టు వ్యాధి రహితంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. విజయలక్ష్మి మాట్లాడుతూ, జిల్లాలో 1,174 మంది ఆశా కార్యకర్తలతో పాటు ఏఎన్ఎంలు, పురుష ఆరోగ్య సిబ్బంది సర్వే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. గతంలో నిర్వహించిన సర్వేలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 20 కుష్టు వ్యాధి కేసులు గుర్తించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి, కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనుమానం కలిగితే వెంటనే వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించే కరపత్రాలను జాయింట్ కలెక్టర్ విడుదల చేశారు. సమావేశంలో నోడల్ అధికారి డాక్టర్ రమేష్, వైద్య అధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## చెక్‌పోస్ట్‌కు ఫ్లెక్సీ అనుమతి ఎవరిది...?

-ఫ్లెక్సీ అనుమతుల పై స్థానికుల ప్రశ్నలు

-వాహనదారులకు తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు

-చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్



బాపట్లసెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

బాపట్ల పాత బస్టాండ్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌కు జనసేన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి భద్రతకు ఇబ్బందులు కలిగించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బాపట్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన పోలీస్ ట్రాఫిక్ చెక్‌పోస్ట్‌కు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెక్‌పోస్ట్‌ను ఫ్లెక్సీలతో కప్పివేయడంతో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ప్రధాన రహదారిపై వాహనదారులకు స్పష్టమైన దృశ్యమానం లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలు పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఎవరు ఇచ్చారనే ప్రశ్నలు తలెత్తు తున్నాయి. మరోవైపు మున్సిపల్ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కూడా ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి భద్రతకు, ట్రాఫిక్ నియంత్రణకు ఆటంకంగా మారిన ఫ్లెక్సీలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## రూ.7.40 లక్షల విలువైన మహాక్వార్డ్ విక్రయాలకు స్టాప్ సేల్స్



గుంటూరు,సెప్టెంబర్ 3 వార్త సాక్ష్యం

నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించిన మహాక్వార్డ్ (ట్రేడ్ నేమ్) ఉత్పత్తి విక్రయాలను నిలిపివేస్తూ స్టాప్ సేల్స్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి తెలిపారు.ఠగుంటూరు ఆర్. అగ్రహారం మెయిన్ రోడ్డులోని శ్రీ పల్నాడు డైలీ ట్రాన్స్‌పోర్ట్స్ ప్రాంగ ణంలో వ్యవసాయ, విజిలెన్స్, ఇతర శాఖల అధికారులు గురువారం సాయంత్రం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్. మోహన్‌రావు, వ్యవసాయ అధికారి ఆర్. సుజాత, విజిలెన్స్ అధికారులు తదితరులు తనిఖీల్లో పాల్గొన్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. విల్లోవుడ్ కెమికల్స్ లిమిటెడ్, గుజరాత్ సంస్థ తయారు చేసి, మహీంద్రా సమ్మిట్ అగ్రిసైన్స్ లిమిటెడ్, హైదరాబాద్ సంస్థ మార్కెటింగ్ చేస్తున్న మహాక్వార్డ్ ఉత్పత్తి విక్రయాలపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో గుర్తించిన స్టాక్ విలువ ఎంఆర్‌పీ ప్రకారం సుమారు రూ.7.40 లక్షలుగా ఉందని తెలిపారు. ఈ ఉత్పత్తికి సంబంధించిన ఇన్‌వాయిస్‌ను వైభవ్ మార్కెటింగ్ కార్పొరేషన్, గుంటూరు పేరిట జారీ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఉత్పత్తి సంబంధిత ప్రిన్సిపల్ సర్టిఫికెట్‌లో చేర్చకపోవడంతో నిబంధనల ప్రకారం స్టాప్ సేల్స్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఉత్పత్తి నమూనాను సేకరించి విశ్లేషణ నిమిత్తం అమరావతిలోని ఆర్‌సీసీ ప్రయోగశాలకు పంపినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి తెలిపారు.తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఎం. లక్ష్మీమాధవి (తహసీల్దార్), కె. చంద్రశేఖర్, పి. శివాజీ (సీఐలు), ఎం. రవికుమార్ (డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్––జీఎస్టీ) తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## డాలర్‌పై రూపాయి పంజా.. ఏకంగా 47 పైసలు లాభం!



అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ నేడు భారీగా బలపడింది. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన వెంటనే రూపాయి ఏకంగా 47 పైసలు లాభపడి 94.26 వద్ద నిలిచింది. నిన్న మార్కెట్ ముగిసే సమయానికి రూపాయి విలువ 94.97గా ఉన్న సంగతి తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చేపట్టిన ప్రత్యేక పథకాల ద్వారా దేశంలోకి భారీగా విదేశీ నిధులు తరలిరావడమే రూపాయి బలోపేతానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. విదేశీ కరెన్సీ సమీకరణ పథకాల ద్వారా భారత్ ఏకంగా 136.38 బిలియన్ డాలర్లను ఆకర్షించినట్లు ఆర్‌బీఐ నివేదించింది. మార్కెట్ వర్గాలు సుమారు 100 బిలియన్ డాలర్లు వస్తాయని అంచనా వేయగా, అంతకుమించి నిధులు రావడం రూపాయికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ నిధుల్లో ఎక్కువ భాగం ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (ఎఫ్‌సీఎన్ఆర్) డిపాజిట్ల రూపంలో రాగా, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ ద్వారా 3.89 బిలియన్ డాలర్లు, ఓవర్సీస్ ఫారిన్ కరెన్సీ బారోయింగ్స్ ద్వారా 5.26 బిలియన్ డాలర్లు సమకూరాయి. ఇదే సమయంలో ఇతర ఆసియా కరెన్సీలు కూడా పుంజుకోవడం, యూఎస్ డాలర్ ఇండెక్స్ 99.50 స్థాయికి దిగువకు పడిపోవడం వంటి అంశాలు కూడా రూపాయికి కలిసొచ్చాయి. జపాన్ యెన్ బలపడటం డాలర్‌పై ఒత్తిడి పెంచింది. ఈ నెలలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల వరకు పెంచవచ్చన్న అంచనాల నేపథ్యంలో, రాబోయే అమెరికా ఆర్థిక డేటా, ఫెడ్ అధికారుల ప్రకటనలపై మార్కెట్ వర్గాలు దృష్టి సారించాయి.

## ఎస్‌బీఐ ఖాతాదారులకు అలర్ట్- ఏటీఎం లావాదేవీల నిబంధనల్లో మార్పు!

భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) తన వినియోగదారులకు సంబంధించి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో లభించే ఉచిత లావాదేవీల సంఖ్యను తగ్గిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి.ప్రస్తుతం ఎస్?బీఐ శాలరీ ప్యాకేజీ ఖాతాదారులు ఇతర బ్యాంకులకు చెందిన ఏటీఎంలు లేదా ఆటోమేటెడ్ డెబిట్ కమ్ విత్‌డ్రాయల్ మెషీన్ల ద్వారా నెలకు 10 ఉచిత లావాదేవీలు చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే, సవరించిన నిబంధనల ప్రకారం ఈ ఉచిత లావాదేవీల సంఖ్యను 5కు పరిమితం చేశారు. పరిమితి దాటిన తర్వాత చేసే ప్రతి ఆర్థిక లావాదేవీకి (నగదు ఉపసంహరణ) రూ. 23తో పాటు జీఎస్టీ, అలాగే ఆర్థికేతర లావాదేవీలకు (బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్ వంటివి) రూ. 11తో పాటు జీఎస్టీ చార్జీలుగా వసూలు చేయ నున్నారు. అయితే, ఈ మార్పు కేవలం శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు మాత్రమే వర్తిస్తుందని, అది కూడా ఇతర బ్యాంకుల ఏటీఎంలను ఉపయోగించినప్పుడు




మాత్రమే వర్తిస్తుందని ఎస్?బీఐ స్పష్టం చేసింది. ఎస్?బీఐకి చెందిన సొంత ఏటీఎంలలో చేసే లావాదేవీలపై ఎటువంటి పరిమి తులు, అదనపు చార్జీలు ఉండవని వెల్లడించింది. అదేవిధంగా, సాధారణ సేవింగ్స్ ఖాతాదారులకు ఈ కొత్త నిబంధనలతో సంబంధం లేదని, వారికి పాత నిబంధనలే యథాతథంగా కొనసాగుతాయని బ్యాంకు పేర్కొంది.

## ఎంబీఏ లేదు.. మాస్టర్స్ లేదు- అయినా యాపిల్ పగ్గాలు ఆయన చేతుల్లోకి!

ఒక భారీ సంస్థకు సీఈఓ కావాలంటే పెద్ద డిగ్రీలు ఉండాలి.. ప్రపంచంలోని అత్యుత్తమ బిజినెస్ స్కూళ్లలో చదివి ఉండాలి.. మేనేజ్‌మెంట్‌లో ఎన్నో ఏళ్ల అనుభవం ఉండాలి. సాధారణంగా మనకు ఉండే అంచనా ఇదే. కానీ యాపిల్ కొత్త సీఈఓ జాన్ టెర్నస్ కథ మాత్రం దీనికి భిన్నం. ఆయన దగ్గర ఎంబీఏ లేదు. మాస్టర్స్ డిగ్రీ కూడా లేదు. ఉన్నది మెకానికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ మాత్రమే. కానీ చిన్న విషయాన్నీ వదిలిపెట్టని స్వభావమే ఆయన్ను యాపిల్‌లో అగ్రస్థానానికి చేర్చింది.



**-కనిపించని స్క్రూలోనూ నాణ్యత వెతికారు**

యాపిల్లో తన తొలి ప్రాజెక్టుల్లో ఒకటైన సినిమా డిస్‌ప్లే తయారీ సమయంలో టెర్నస్ చూపించిన శ్రద్ధ ఆయన వ్యక్తిత్వాన్ని చెబుతుంది. మానిటర్ వెనుక భాగంలో ఉండే ఓ చిన్న స్క్రూపై ఆయన దృష్టి పడింది. దాన్ని సాధారణ వినియోగదారు చూడక పోవచ్చు. అయినా ఆ స్క్రూ తలపై ఉన్న గీతలను ఆయన మాగ్నిఫైయింగ్ గ్లాస్‌తో లెక్కపెట్టారు. అవి 35 ఉన్నాయని గుర్తించారు. ఉండాల్సింది 25 మాత్రమేనని సప్లయర్‌తో వాదించారు. రాత్రి దాటిపోయినా ఆ విషయాన్ని వదల్లేదు. 'ఇదంతా అవసరమా?' అని తనను తాను ప్రశ్నించుకున్నారు. చివరికి 'సాధారణం కాకపోవచ్చు.. కానీ సరైనదే' అని నిర్ణయిం చుకున్నారు.

**-'ఎవరూ చూడకపోయినా నాకు ముఖ్యం'**

ఉత్పత్తిలో పెట్టిన ప్రతి చిన్న శ్రమకు విలువ ఉంటుందని టెర్నస్ నమ్ముతారు. వినియో గదారు ఆ వివరాన్ని గమనించినా.. గమనించ కపోయినా నాణ్యతలో రాజీ పడకూడదనేది ఆయన సిద్ధాంతం. అందుకే ఆయనను యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్‌తో పోలుస్తుంటారు. ఉత్పత్తిలో ప్రతి చిన్న అంశాన్నీ జాబ్స్ ఎంతో జాగ్రత్తగా పరిశీలించేవారు.

**-25 ఏళ్ల అనుభవం.. ఇప్పుడు అగ్రస్థానం**

టెర్నస్ 2001లో యాపిల్‌లో చేరారు. 2013లో హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా ఎదిగారు. 2021లో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఐఫోన్, మ్యాక్, ఐప్యాడ్, యాపిల్ వాచ్, ఎయిర్‌పాడ్స్ వంటి ఉత్పత్తుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.

## సెంచరీతో స్మృతి మంధాన రికార్డుల మోత- మహిళల క్రికెట్‌లో సరికొత్త చరిత్ర!

దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ 2026లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సంచలనం సృష్టించింది. హాంకాంగ్‌తో జరిగిన గ్రూప్-ఏ మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీతో చెలరేగిన ఆమె, పలు రికార్డులను బద్దలు కొట్టింది. ఈ ఇన్నింగ్స్‌తో మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా స్మృతి సరికొత్త చరిత్ర లిఖించింది. ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న భారత లెజెండరీ క్రికెటర్ మిథాలీ రాజ్‌ను ఆమె అధిగమించింది. ఈ మ్యాచ్‌లో స్మృతి కేవలం 64 బంతుల్లో 14 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 124 పరుగులు చేసింది. ఈ సెంచరీతో అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక శతకాలు నమోదు చేసిన మహిళా క్రికెటర్‌గా కూడా ఆమె రికార్డు సృష్టించింది. ఆమె విధ్వంసకర బ్యాటింగ్‌తో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీ స్కోరు సాధించింది.

అంతకుముందు టాస్ గెలిచిన హాంకాంగ్ కెప్టెన్ నటాషా మైల్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. అయితే, ఆరంభం నుంచే స్మృతి మంధాన దూకుడుగా ఆడి స్కోరు బోర్డును పరుగులు




పెట్టించింది. ఆమె అద్భుత ప్రదర్శనతో భారత జట్టు పటిష్ఠ స్థితిలో నిలిచింది.

## చీఫ్ సెలెక్టర్ పదవికి అగార్కర్ గుడ్‌బై? బీసీసీఐ కీలక క్లారిటీ

టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవిపై వస్తున్న ఊహాగానాలకు బీసీసీఐ తెరదించింది. గురువారం జరిగిన కీలక సమీక్ష సమావేశానికి అగార్కర్ హాజరుకాకపోవడంతో.. ఆయన పదవీకాలం పై పలు రకాల వార్తలు వచ్చాయి. అయితే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఈ ప్రచారాలను కొట్టిపారేశారు.అ ఈ సమావేశానికి టెస్టులు, వన్డేలకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20లకు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ హాజరయ్యారు. బీసీసీఐ ఉన్నతాధికారులతో పాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రికెట్ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. అయితే అగార్కర్ మాత్రం ప్రత్యక్షంగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో అగార్కర్ పదవీకాలం కొనసాగుతుందా? ఆయనకు పొడిగింపు ఇస్తారా? అన్న చర్చ మొదలైంది. దీనిపై సైకియా స్పష్టత ఇచ్చారు. అగార్కర్ నగరంలో లేరని చెప్పారు. సమావేశాన్ని చాలా తక్కువ వ్యవధిలో ఏర్పాటు చేయడంతో ఆయన హాజరు కాలేకపోయారని తెలిపారు. ఆన్‌లైన్‌లో పాల్గొనేందుకు ప్రయత్ని ంచినా.. ఆయన ఉన్న ప్రాంతంలో అది సాధ్యం కాలేదన్నారు. అగార్కర్‌కు చీఫ్ సెలెక్టర్‌గా పొడిగింపు ఇవ్వడంపై సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదని సైకియా స్పష్టం చేశారు. అలాగే వీవీఎస్ లక్ష్మణ్‌ను బీసీసీఐ క్రికెట్ డైరెక్టర్‌గా నియమించే అంశంపైనా ఎలాంటి చర్చ జరగలేదని చెప్పారు. అగార్కర్ చీఫ్



సెలెక్టర్‌గా ఉన్న సమయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు తీవ్ర చర్చకు దారితీశాయి. టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్‌కు దీర్ఘకాలిక మద్దతు ఇవ్వడం అందులో ఒకటి. హార్దిక్ పాండ్యాకు బదులుగా సూర్యకుమార్‌ను ఎంపిక చేయడంపై విమర్శలు వచ్చాయి.అలాగే విజయవంతమైన కెప్టెన్ రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించడం కూడా సున్నితమైన నిర్ణయంగా మారింది. అయితే ఈ నిర్ణయాల విషయంలో అగార్కర్ వెనక్కి తగ్గలేదు. విమర్శలను ఎదుర్కొంటూ తన నిర్ణయాలను సమర్థించుకున్నారు. సెలెక్టర్ పని కేవలం గణాంకాలు చూసి జట్టును ఎంపిక చేయడం కాదని.. ప్రజాదరణ ఆధారంగా ప్రతి నిర్ణయం తీసుకోలేమనే విషయాన్ని అగార్కర్ తన పదవీకాలంలో చూపించారని విశ్లేషణలు చెబుతున్నాయి. కీలక నిర్ణయాలపై విమర్శలు వచ్చినా.. వాటిని ఎదుర్కొంటూ ముందుకు సాగడం ఆయన పదవీకాలంలో ప్రత్యేకంగా కనిపించింది.

# స్పోర్ట్స్

## ఆటగాళ్ల గాయాలకు చెక్.. బీసీసీఐ పకడ్బందీ ప్లాన్



భారత క్రికెటర్లను వెంటాడుతున్న గాయాల సమస్యపై బీసీసీఐ దృష్టి సారించింది. వరుసగా అంతర్జాతీయ మ్యాచ్‌లు, ఐపీఎల్ వంటి ఫ్రాంచైజీ టోర్నీలు ఆడాల్సి రావడం ఆటగాళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని బోర్డు గుర్తించింది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు 'భవిష్యత్ పర్యటనల ప్రణాళిక' (ఎఫ్‌టీపీ)లో మార్పులు చేయాలని నిర్ణయించింది. ముంబైలో గురువారం జరిగిన సమీక్షా సమావేశం తర్వాత బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఈ విషయాన్ని వెల్లడించారు. టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సమావేశంలో పాల్గొన్నారు. ఆటగాళ్లకు తగిన విశ్రాంతి లభించేలా భవిష్యత్ షెడ్యూల్‌ను రూపొందించడంపై చర్చించారు. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు ఆటగాళు రెండు నెలల పాటు ఐపీఎల్‌లో ఆడారని సైకియా గుర్తుచేశారు. ఆ తర్వాత అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడటంతో పలువురు గాయపడ్డారని చెప్పారు. ఇకపై ఇలాంటి పరిస్థితులు రాకుండా ఎఫ్‌టీపీలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఆటగాడు గాయం నుంచి కోలుకున్న తర్వాత తిరిగి జట్టులోకి రావడానికి ఉన్న నిబంధనలను కూడా సమీక్షించారు. సొంత ఫిజియో పర్యవేక్షణలో గానీ, బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో గానీ పునరావాసం పూర్తి చేయాల్సి ఉంటుంది. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే అంతర్జాతీయ క్రికెట్‌కు అనుమతిస్తారు. గాయాల విషయంలో వ్యక్తిగత ఆటగాళ్లపై ఎలాంటి చర్చ జరగలేదని సైకియా స్పష్టం చేశారు. ఆటగాళ్ల ఫిట్‌నెస్, పునరావాసానికి సంబంధించిన విధానాలపైనే సమావేశంలో చర్చ జరిగిందన్నారు. కెప్టెన్లు, కోచ్ నుంచి సలహాలు తీసుకుని కొత్త వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
శుక్రవారం 04 సెప్టెంబర్ 2026

# 'యేషనాగుల' దుమ్మురేపుతోంది యూట్యూబ్‌లో అదిరిపోయే రికార్డు!






నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలోని రెండో పాట 'యేషనాగుల' మరో సంచలనం సృష్టించింది. విడుదలైన ఐదు రోజుల్లోనే 50 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన తొలి తెలుగు పాటగా రికార్డు సృష్టించిందని చిత్రబృందం ప్రకటించింది. 'యేషనాగుల' పాట ఆగస్టు 29న విడుదలైంది. తెలంగాణ జానపద బాణీకి ఆధునిక టచ్ జోడించిన ఈ పాటకు మంచి స్పందన వస్తోంది. పాట విడుదలైన కొద్దిరోజుల్లోనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలోనూ ట్రెండ్‌గా మారింది. నాని, కీర్తి సురేశ్ కనిపించే ఈ పాటకు అభిమానులు భారీగా స్పందిస్తు న్నారు. గ్లోబల్ చార్టుల్లోనూ దూకుడు' యేషనాగుల' యూట్యూబ్ గ్లోబల్ చార్టుల్లో నంబర్ వన్ ట్రెండింగ్‌లో ఉందని 'ది ప్యారడైజ్' అధికారిక ఖాతా వెల్లడించింది. ఐదు రోజుల్లో 50 మిలియన్ల మార్క్‌ను దాటడం విశేషంగా మారింది. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన రీల్స్, డ్యాన్స్ వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం రాశారు. ప్రభా బంగారిగల్ల, అద్దుల జంగిరెడ్డి పాడారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్'లో నాని కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ పాట విడుదల సమయంలో అనిరుధ్ రవిచందర్ డల్లాస్ కచేరీలో నాని వేదికపైకి వచ్చి సందడి చేయడం కూడా అభిమానుల్లో ఆసక్తిని పెంచింది.

## 'రోమాంచకం' మూవీ రివ్యూ

అగ్ర దర్శకులు తమ సొంత నిర్మాణ సంస్థలో సినిమాలు నిర్మించడం కొత్తేమీ కాదు. ఇప్పుడు ఆ వరుసలోనే పాన్ ఇండియా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తన బ్యానర్ భద్రకాళి సంస్థపై నిర్మించిన చిత్రం 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జోడీగా నటించిన ఈ సినిమాకు వేణుగోపాల్ రెడ్డి దర్శకుడు. ప్రచారం చిత్రాలతో, పబ్లిసిటీతో అలరించిన ఈ సినిమా యూత్‌లో మంచి బజ్‌ను తెచ్చుకుంది. ఇక ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ఎలా ఉంది? 'రోమాంచకం' ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేసిందా? అనేది సమీక్షలో తెలుసుకుందాం. అన్వేష్ (సుమంత్ ప్రభాస్) ఫ్రెండ్స్‌తో కలిసి ఒక స్టార్టప్ కంపెనీని ప్రారంభించే ట్రయల్స్‌లో ఉంటాడు.ఇందులో భాగంగానే 'రోమాంచకం'పేరుతో డేటింగ్ యాప్‌ను డెవలప్ చేస్తుంటాడు. అమ్మాయిలు, అబ్బాయిల మధ్య రిలేషన్స్, ఒకరికొకరు సహకరించుకోవడం, ఒకరి అవసరాలు మరొకరు తీర్చడమే ఈ డేటింగ్ యాప్ లక్ష్యం అని చెప్పి ఇన్వెస్టర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తుంటాడు. అయితే ఇదే యాప్ ద్వారానే చెన్నైకి చెందిన మైథిలి (అనంతిక సనీల్‌కుమార్) అనే అమ్మాయితో అతనికి పరిచయం ఏర్పడుతుంది. ఈ పరిచయం ఇద్దరి మధ్య మరింత స్ట్రాంగ్ అవుతుంది. మైథిలి పుట్టినరోజున ఆమెని సర్‌ప్రైజ్ చేయాలని చెన్నై వెళతాడు. ఓ హోటల్‌లో ఉన్న అన్వేష్‌ని మైథిలి కలుస్తానని చెబుతుంది. కానీ మైథిలి హోటల్‌కు రాకుండా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి, సోషల్ మీడియా అకౌంట్లలోనూ అన్వేష్‌ని బ్లాక్ చేసేస్తుంది. అయితే మైథిలి హోటల్‌కు రాకపోవడానికి కారణం ఏమిటి? ఆమె కనిపించకపోవడానికి కారణమేమిటి? ఆమె మళ్లీ తిరిగొచ్చిందా? లేదా? అన్వేష్, మైథిలి పెళ్లి చేసుకున్నారా? లేదా? అనేది మిగతా కథ.




## 'ఆవారాపన్-2' బ్లాక్ బస్టర్ హిట్: ఎమోషనల్ పోస్ట్ చేసిన హీరోయిన్ దిశా పటానీ




ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ఆవారాపన్ -2' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణతో ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రేక్షకులందరూ ఎప్పటికీ ప్రేక్షకులు కురిపిస్తున్న అపారమైన ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినై ఉంటానని తెలిపారు. ఈ స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ గుర్తుంచుకునే ఒక అద్భుతమైన కథను చెప్పే ఈ ప్రయాణంలో, ఇంత మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక బృందంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని, 'ఆవారాపన్-2' చిత్రంపై లభించడం తన అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. 2007లో మోహిత్ సూరి దర్శకత్వంలో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా వచ్చిన 'ఆవారాపన్' చిత్రం రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి కేవలం రూ. 12 కోట్లు మాత్రమే రాబట్టి ఆ సమయంలో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన దీని సీక్వెల్ 'ఆవారాపన్-2' మాత్రం రూ. 200 కోట్ల మార్కును దాటి ఘన విజయం సాధించింది.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.